ములుగురూరల్ : రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న ఎస్సై, తదితరులు

కృష్ణకాలనీ : విద్యార్థులకు పండ్లు పంపిణీ చేస్తున్న మానవ హక్కుల కమిటీ సభ్యులు ←

ప్రతి పౌరుడు విధులు సక్రమంగా నిర్వర్తించాలి

- జూనియర్ సివిల్ జడ్జి రామచంద్రరావు
- ఘనంగా అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం

కృష్ణకాలనీ : సమావేశంలో మాట్లాతున్న జడ్జి రామచంద్రరావు

కృష్ణకాలనీ, డిసెంబర్ 10 : పౌరులు హక్కులను అనుభవించడంతో పాటు విధులను సక్రమంగా నిర్వర్తించాలని భూపాలపల్లి జిల్లా జూనియర్ సివిల్ జడ్జి ఎన్ రామచంద్ర రావు అన్నారు. ఆదివారం జిల్లా కోర్టు ప్రాంగణంలోని డీఎల్ఎస్ఏ హాల్‌లో జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ భారత రాజ్యాంగం హక్కులతో పాటు విధులనూ కల్పించిందన్నారు. సమాజంలో ఒకరి హక్కులను మరొకరు భంగం కలిగించడం నేరమన్నారు. ఈ కార్యక్రమంలో పారాలీగల్ వలంటీర్లు, న్యాయసేవాధికార సంస్థ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కృష్ణకాలనీలో..

భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని కృష్ణకాలనీలోని మానసిక, చెవిటి, మూగ పాఠశాలలో జాతీయ మానవ హక్కుల కమిటీ జిల్లా అధ్యక్షుడు దుండ్ర కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో ఆదివారం అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మానవ హక్కుల కమిటీ సభ్యులు విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జాతీయ మానవ హక్కుల కమిటీ సభ్యులు అమృత అశోక్, తోట రాజయ్య, ఇప్పకాయల రాధాకృష్ణ, బానాల దేవేందర్, పక్కల మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

మానవ హక్కులను కాపాడుకోవాలి

ఎస్సై వెంకటేశ్వర్

ములుగురూరల్ : మానవ హక్కులను కాపాడుకోవాలని ఎస్సై వెంకటేశ్వర్ అన్నారు. ఆదివారం ప్రపంచ మానవహక్కుల దినోత్సవం సందర్భంగా ఎన్‌హెచ్‌ఆర్‌సీ రాష్ట్ర అధ్యక్షుడు మొగుళ్ల భద్రయ్య ఆదేశాల మేరకు జిల్లా కన్వీనర్ పెట్టెం రాజు ప్రభుత్వ దవాఖానలో పండ్ల పంపిణీ చేశారు. ఎస్సై హాజరై రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చట్టాలను గౌరవించాలని తెలిపారు. మానవ హక్కులను కాపాడడంలో పోలీసులు ముందుంటారన్నారు. ప్రజలు ప్రశాంతమైన జీవితాన్ని గడపాలని, శాంతిభద్రతలకు విఘాతం కల్గించొద్దన్నారు. ఈ కార్యక్రమంలో కోకన్వీనర్ ఏడుకొండలు, వేల్పుల కృష్ణ, బల్గూరి సంజీవయ్య, బొచ్చు రాజేందర్, జనార్దన్ రాజు, రతన్, సురేశ్ పాల్గొన్నారు.

రామ్మూర్తికి నియమాయపత్రాన్ని అందిస్తున్న యాసిన్, శ్రీనివాస్‌రెడ్డి

హక్కులపై అవగాహన కలిగి ఉండాలి

ప్రతి ఒక్కరూ హక్కులపై అవగాహన కలిగి ఉండాలని మానవ హక్కుల నేషనల్ చైర్మన్ డాక్టర్ యాసిన్, రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం ములుగు జిల్లా కేంద్రంలో మానవ హక్కుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా బస్టాండ్ ఆవరణలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు పాల్తియ రాజశేఖర్ నాయక్, రాష్ట్ర ఈసీ సభ్యుడు చల్లూరి మహేందర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. వ్యక్తి స్వేచ్ఛకు భంగం కలిగితే న్యాయస్థానాల ద్వారా న్యాయం పొందవచ్చునని తెలిపారు. అలాగే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎలకంటి రాజు, సంయుక్త కార్యదర్శి రామ్మూర్తి, ప్రచార కార్యదర్శి వీ కర్ణాకర్, రమేశ్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రవీణ్‌కు నియామక పత్రాలను అందించారు. అనంతరం ప్రభుత్వ దవాఖానలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు.

స్కాలర్‌షిప్ ప్రవేశ పరీక్ష ప్రశాంతం

డీఈఓ రాంకుమార్

కృష్ణకాలనీ, డిసెంబర్ 10 : భూపాలపల్లి జిల్లాలోని రెండు పరీక్షా కేంద్రాల్లో ఆదివారం నిర్వహించి నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్‌షిప్ ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగినట్లు డీఈవో రాంకుమార్, పరీక్షల నియంత్రణ అధికారి మందల రవీందర్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాటారం జడ్పీ పాఠశాల ఏర్పాటు చేసినా పరీక్షా కేంద్రంలో 146 మంది విద్యార్థులకు 130మంది హాజరు కాగ16మంది గైర్హాజరైనట్లు తెలిపారు. అలాగే భూపాలపల్లి జడ్పీ పాఠశాలలో 219మంది విద్యార్థులకు 209 మంది విద్యార్థులు హాజరై, 10మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు తెలిపారు. ఈ పరీక్షలో అర్హత సాధించిన విద్యార్థులకు 5 సంవత్సరాల పాటు ఒక్కో సంవత్సరానికి రూ. 12వేల చొప్పున ఉపకార వేతనం కేంద్ర ప్రభుత్వం అందిస్తుందని వివరించారు. పరీక్ష కేంద్రాలను డీఈఓ రాంకుమార్, పరీక్షల నియంత్రణ అధికారి మందల రవీందర్‌రెడ్డి పరిశీలించారు.

మాలధారులకు అన్నం వడ్డిస్తున్న సబ్ రిజిస్ట్రార్ తస్లీమా మహ్మద్

మత సామరస్యాన్ని చాటిన తస్లీమా మహ్మద్

ములుగురూరల్, డిసెంబర్10 : మహబూబాబాద్ సబ్ రిజిస్ట్రార్ తస్లీమా మహ్మద్ మత సామరస్యాన్ని చాటారు. ఆదివారం ములుగు జిల్లా కేంద్రంలోని కుటీరంలో అయ్యప్ప స్వాములకు భిక్షను ఏర్పాటు చేశారు. స్వాములకు స్వయంగా భోజనం వండించి వారితో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారతదేశం విభిన్న సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని అన్నారు. మతాలు వేరైనా భావాలు ఒక్కటేనని తెలిపారు. మతం కన్న మానవత్వం గొప్పదని, మనుషులంతా ఐక్యమత్యంగా ఉంటూ స్నేహభావంతో మెలగాలన్నారు. ఈ కార్యక్రమంలో గురు స్వామి రమేశ్, అయ్యప్ప మాలధారులు పాల్గొన్నారు.

కోతుల పట్టివేతకు బోన్‌లు ఏర్పాటు చేసిన గ్రామస్తులు

కోతుల పట్టివేతకు బోన్ల ఏర్పాటు

గోవిందరావుపేట, డిసెంబర్10 : కోతుల దాడుల నుంచి రక్షణ కోసం స్థానికులు బోన్‌లు ఏర్పాటు చేసుకున్నారు. మండలంలోని పస్రాలో భూక్యా సుమలతా సక్రూనాయక్ ఆధ్వర్యంలో పలువురి దాతల సహకారంతో బోన్‌లు కిరాయికి తెప్పించి వీధుల్లో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సుమలత మాట్లాడుతూ గ్రామంలో కోతుల బెడద ఎక్కువై ప్రజలు ఇండ్లలో నుంచి బయటకు రావాలంటేనే జంకుతున్నారన్నారు. వాటి కోసం బోన్‌లు తెప్పించినట్లు పేర్కొన్నారు.

శివాలయంలో అన్నదానం

మహదేవపూర్, డిసెంబర్ 10 : మండల కేంద్రంలోని శివాలయంలో ఆదివారం గురుస్వామి గుడాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో మండల కేంద్రానికి చెందిన అడప నందకిశోర్ అయ్యప్ప స్వాములకు అన్నదానం చేశారు. స్వామి మాలధారులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఎస్సై రాజ్ కుమార్, అయ్యప్ప గురు స్వాములు సిరిపురం సుధాకర్, బాలయ్య, నార్ల పూర్ శ్రీనివాస్, నాగభూషణం, గోరంటల రాజు, సాగర్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

భిక్షలో పాల్గొన్న అయ్యప్ప స్వాములు

సక్కుభాయిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

ఎంపీటీసీకి ఎమ్మెల్యే 'పల్లా' పరామర్శ

బచ్చన్నపేట, డిసెంబర్ 10 : మండలంలోని పడమటికేశ్వాపూర్ ఎంపీటీసీ చల్లా సక్కుభాయి గుండెపోటుకు గురై హైదరాబాద్‌లోని రష్ దవాఖానలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆదివారం దవాఖానకు వెళ్లి ఆమెను పరామర్శించారు. అనంతరం ఆరోగ్య పరిస్థితిపై సంబంధిత వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. సక్కుభాయి త్వరగా కోలుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ఆయన వెంట సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు గంగం సతీశ్‌రెడ్డి, రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు చల్లా శ్రీనివాస్‌రెడ్డి, ఆలింపూర్ సర్పంచ్ నరెడ్ల బాల్‌రెడ్డి, పడమటికేశ్వాపూర్ గ్రామశాఖ అధ్యక్షుడు చల్లా తిరుపతిరెడ్డి, బీఆర్ఎస్ మండల నాయకులు మల్లవరం వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

కారు ఢీకొని వ్యక్తి దుర్మరణం

లింగాలఘనపురం, డిసెంబర్ 10 : నెల్లుట్ల ఫ్లైఓవర్‌పై ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు దుర్మరణం చెందారు. గ్రామస్తులు తెలిపిన ప్రకారం.. నెల్లుట్లకు చెందిన పేరబోయిన సత్తయ్య అతని కుమారులు వెంకటేశ్, శ్రీనివాస్‌లతో కలిసి బైక్‌పై జనగామకు వెళ్తున్నాడు. నెల్లుట్ల ఫ్లైఓవర్‌పై ఎదురుగా వస్తున్న కారు వీరి బైక్‌ను ఢీకొట్టడంతో సత్తయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. వెంకటేశ్, శ్రీనులకు తీవ్ర గాయాలు కాగా స్థానికులు జనగామ ఏరియా దవాఖానకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గోదావరి తీర యాత్రకు వచ్చిన సాధువులు, యాత్రికులు

నదులను సంరక్షించాలి

ములుగురూరల్, డిసెంబర్10 : జీవకోటికి నీరే ఆధారమని, నదుల సంరక్షణకు భారతీయులంతా పాటు పడాలని ఆచార్య మహా మండలేశ్వర్ బృందం సాధువులు అన్నారు. మహారాష్ట్రకు చెందిన సాధువులు, మహా మండలేశ్వర్ బృందం సభ్యులు గోదావరి పరివాహక ప్రాంతంపై బస్సు యాత్రను చేపట్టారు. ఆదివారం ములుగు మండలం అబ్బాపూర్ గ్రామ శివారు వద్ద వారు విడిది చేసి నమస్తే తెలంగాణతో మాట్లాడారు. గురూజీ మహా మండలేశ్వర్ ఆధ్వర్యంలో 300మంది సాధువులు 6 బస్సుల్లో గోదావరి పరివాహక యాత్రను చేపట్టినట్లు తెలిపారు. నాసిక్ నుంచి త్రయంబేశ్వర్ వరకు గోదావరికి ఇరువైపుల ఉన్న ప్రాంతాలను సందర్శిస్తున్నట్లు తెలిపారు. నాసిక్ కుంభమేళా జరిగే లోపు యాత్రను పూర్తి చేయనున్నట్లు తెలిపారు. ఇతర రాష్ట్రాల కంటే తెలంగాణలో గోదావరి నది కలుషితం లేకుండా ఉందన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

ములుగు రూరల్, డిసెంబర్10 : కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వ విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని ప్రొగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు వనపాకల దిలీప్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ఉపాధ్యాయుల పదోన్నతలు, బదిలీల కేసులను పరిష్కరించి పూర్తి చేయాలన్నారు. అనంతరం నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వానికి, మంత్రిగా బాధ్యతలు చేపట్టిన సీతక్కకు శుభాకాంక్షలు తెలిపారు.